'గృహలక్ష్మి' దరఖాస్తుల స్వీకరణ

కృష్ణా: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం గృహలక్ష్మి దరఖాస్తులను స్వీకరించినట్లు తహసీల్దార్ సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు తమ దరఖాస్తులను కేవలం తెల్లకాగితంపై రాసి ఇచ్చిన వాటిని స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మిగితా ధృవపత్రాలను తీసుకుంటామని, ప్రస్తుతానికి దరఖాస్తులు మాత్రమే స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మధన్‌మోహన్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జయరాములు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదాయ, కుల ధృవీకరణ పత్రాలు లేకపోయిన అధార్, ఓటర్, ఖాళీ స్థలం సంబంధించిన పత్రాలు, లేదా ఇంటినెంబర్ రసీదులో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మండలంలో బుధవారం 712 దరఖాస్తులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు.

గృహ లక్ష్మి గడువు పెంచాలని వినతి...

కోస్గి: ప్రభుత్వం నూతనంగా అమలుచేస్తున్న గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునే గడువును మరో 15రోజులు పొడగించాలని కాంగ్రెస్ మైనార్టీ నాయకులు సలీం, ఫెరోజ్ మున్సిపల్ కమిషనర్ శశిధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ విషయంలో ప్రభుత్వం మరోమారు పునరాలోచించాలని డిమాండ్ చేశారు.


దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్

మరికల్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుగడవు పొడింగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరన్న, నాయకులు రామకృష్ణ అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తుకు కేవలం మూడురోజుల గడవు ఉండడంతో లబ్ధిదారులు కుల, ఆదాయ ధృవ పత్రాలకోసం మీ సేవ కేంద్రాల దగరకు గుంపులు, గుంపులుగా వేళ్లి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గృహలక్ష్మి పథకానికి 15రోజుల వరకు గడవు పొడగించాలని డిమాండ్ చేశారు.

కోస్గి: ప్రభుత్వం ఖాళీస్థలాలు ఉన్న మహిళలు, వితంతువులకు గృహలక్ష్మి పథకంలో ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించి కేవలం మూడు రోజుల సమయం ఇవ్వడం సరికాదని, దరఖాస్తు గడువును పెంచాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డీకే రాములు డిమాండ్ చేశారు. అధికారులు ఈ నెల 7 నుంచి 10 వరకు మూడురోజుల గడువు ఇచ్చారని, ప్రభుత్వానికి పేదలపై ఏ మాత్రం చిత్త శుద్ధి ఉన్న గృహలక్ష్మి పథకానికి సంబంధించిన గడువును పెంచాలన్నారు.

గృహలక్ష్మితో ప్రజల ఇబ్బందులు

మాగనూర్: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 'గృహలక్ష్మితో సామన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం దరఖాస్తు గడువు పెంచాలని ఎంపీపీ శ్యామలమ్మ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారులు విషయాలను దృష్టిలో ఉంచుకొని దరఖాస్తు గడువుతేదీ పొడగించాలని కోరారు.

మరింత జాగ్రత్తగా ఉండాలి

- జిలాల్‌పూర్‌లో కార్డెన్ సెర్చ్
- సరైన పత్రాలు లేని 35వాహనాలు సీజ్


పట్టుబడిన వాహనాలు


మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

నారాయణపేట రూరల్: మండలంలోని జిలాల్‌పూర్‌లో బుధవారం సాయంత్రం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ వివరాలు తెలుసుకున్నారు. ఆధార్‌కార్డు, వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. చివరికి గ్రామ ఆంజనేయస్వామి ఆలయం వద్ద చేరారు. అదే సమయంలో డీఎస్పీ సత్యనారాయణ అక్కడికి చేరుకున్నారు. గ్రామస్తులతో డీఎస్పీ మాట్లాడారు. ప్రజల రక్షణ కోసమే కమ్యూనిటీ కాంట్రాక్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, గ్రామంలో అనుమానాస్పదంగా ఎవరైనా తిరిగితే డయల్ 100కు ఫిర్యాదు చేయాలని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులతో వస్తువులు, తినుబండారాలు తీసుకోరాదని, ఆశ్రయం ఇవ్వరాదని చెప్పారు. ధ్రువపత్రాలు లేని వాహనాలను కొనుగోలు చేయరాదని, ముఖ్యంగా కర్ణాటక సరిహద్దులో ఉండటంతో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. సీఐ రవిబాబు పర్యవేక్షణలో 60మంది పోలీసు సిబ్బంది కార్డెన్ సెర్చ్‌లో పాల్గొని సరైన పత్రాలు లేని 35వాహనాలను సీజ్ చేసి పీఎస్‌కు తరలించారు. ఎస్ఐలు విజయ్‌కుమార్, జయప్రసాద్, శ్రీనివాస్‌రావు, శివయ్య, నరేష్, లక్ష్మణ్, పోలీసు సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల మెమొరాండం

నారాయణపేట రూరల్: గత 34 రోజులుగా కొనసాగిన జీపీ కార్మికుల సమ్మెకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీతో విధుల్లో చేరుతున్నట్లు ఆ సంఘం నాయకులు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ నాయకులతో కలిసి మెమోరండం అందించారు. ప్రభుత్వం స్పందించకపోతే తమ సమస్యలు సాధించుకునేందుకు భవిష్యత్‌లో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. జీఓ 60 ప్రకారం కార్మికుల వేతనాలు పెంచాలని, కనీస వేతనం రూ.19,500 చెల్లించాలన్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, జీపీ ట్రాక్టర్లకు డ్రైవర్లను నియమించాలన్నారు. కార్మికుల ప్రాణత్యాగంతో సాధించుకున్న 29 రకాల చట్టాలను తుంగలోతొక్కి పనులు చేయిస్తుందని దుయ్యబట్టారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నర్సింహులు, బలరాం, వెంకటయ్య, రాజు, సీతానాయక్, వెంకటేష్, కృష్ణ పాల్గొన్నారు.

బీడీ కార్మికుల వినతి



ధన్వాడ: బీడీకార్మిలకు గృహలక్ష్మి పథకంలో ఇండ్లను మంజూరు చేయాలని కోరుతూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉప తహసీల్దార్ గాయత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీడీకార్మికులకు ప్రభుత్వం ఇండ్లు మంజూరుచేస్తామని చెప్పి ఎండ్లుగడుస్తున్నా నేటికీ మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇండ్లను మంజూరు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నర్సింహులు, వెంకట్రాములు, బాల్‌రాజు, వెంకటమ్మ, లక్ష్మి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేయాలి


నిరసన వ్యక్తంచేస్తున్న నాయకులు

మద్దూరు: కేంద్ర ప్రభుత్వం రైతు పండించే పంటలకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేయాలని అఖిలభారత ప్రగతిశీల రైతుసంఘం నాయకుడు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో 'మహ పడావో' కార్యక్రమం నిర్వహించారు. పాత బస్టాండ్ చౌరస్తాలో ఈ చట్టాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండా నర్సింహులు మాట్లాడుతూ.. కేంద్రం కార్పొరేట్ వ్యవసాయ చట్టాలను తీసుకోస్తే దేశరాజధాని నడిబొడ్డున రైతుల సంఘాల ఆధ్వర్యంలో ఈ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 14నెలల పాటు ధర్నాచేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చినహామీలను వ్యవసాయ కార్మికుల సమగ్రమైన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు దారదత్తం చేయడానికి వ్యతిరేకంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు అయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాములు, కొండప్ప, కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేద్దాం

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయ సమస్యల సాధనకు గురువారం జిల్లా కేంద్రంలో చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేరికృష్ణారెడ్డి, నర్సింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్ల పదోన్నతులు, బదిలీలు చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, కమిటీల పేరుతో పీఆర్‌సీ విషయంలో కాలయాపన చేస్తున్నారని, వెంటనే పెండింగ్ బిల్లులు డీఏలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధనకు కలిసి పోరాటం చేద్దామని, ఉపాధ్యాయులు ఉదయం 10గంటలకు శ్రీవివేకానందస్వామి మున్సిపాల్ పార్క్‌కు రావాలని కోరారు.

పుట్టినబిడ్డకు ముర్రుపాలు తాగించాలి


గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఊట్కూరు: పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని, ముర్రుపాలలో వ్యాధి నిరోధకశక్తి అధికంగా ఉంటుందని ఏఎన్ఎం మణిమాల అన్నారు. బుధవారం మండలంలోని భరత్‌నగర్ కాలనీలోని అంగన్‌వాడీలో తల్లిపాలవారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు విధిగా తాగించాలన్నారు. అంతకుముందు పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, షాజహానాబేగం, వైద్య సిబ్బంది విజయ్‌కుమార్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా వీజేఆర్

- ఫౌండేషన్ చైర్మన్ వర్కటం జగన్నాథ్‌రెడ్డి
- 60 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ


విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న వీజేఆర్ చైర్మన్ వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మక్తల్: నిరుపేద విద్యార్థులకు అండగా వీజేఆర్ ఫౌండేషన్ ఉంటుందని చైర్మన్ వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 60 మంది పదో తరగతి విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల నుంచి మండల కేంద్రంలో చదువుకునేందుకు కాలినడకతో వచ్చే విద్యార్థుల కోసం వీటిని అందజేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి చక్కగా చదవుకొని ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలనే తపనతోనే ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తమ సంస్థ ద్వారా సైకిళ్లను అందజేస్తున్నామని చెప్పారు. పదో తరగతి బాలికలకు మొదటి ప్రాధాన్యతగా బుధవారం అందించామన్నారు. నియోజకవర్గంలో దాదాపు 600 సైకిళ్లను రూ.65 లక్షల ఖర్చుతో ఇస్తున్నామని, మొదటి విడతగా 350 మందికి పంపిణీ చేస్తామన్నారు. సమాజ సేవ కోసం తన వంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారికి అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతుందని వివరిరించారు.

మా గోస తీర్చారు..



గ్రామం నుంచి చదువుకోవడానికి పాఠశాలకు వెళ్లే క్రమంలో మేం పడే గోసను అర్థం చేసుకొని సైకిళ్లు అందజేయడం వల్ల మాకు ఎంతో మేలు చేసినట్లయ్యింది. కాలినడకతో పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు మాకు ఎంతో సంతోషంగా ఉంది. సార్.. మీ మేలు ఎప్పుడూ మరువలేం.

– మౌనిక, పదో తరగతి విద్యార్థి, గుర్లపల్లి

చిరకాలం గుర్తుంచుకుంటా..



పాఠశాలకు వచ్చే సమయంలో నడుచుకుంటూ వెళ్లాలని ప్రతిరోజూ ఆలోచన ఉండేది. ఇలా ప్రతిరోజు నడవడం వల్ల అలసిపోయి చదువు మీద శ్రద్ధ పెట్టలేకపోయేవాళ్లం. కొన్నిసార్లు పాఠశాలకు వెళ్లాలనిపించేది కాదు. ప్రతిరోజు చార్జీలు పెట్టుకొని వెళ్లే స్తోమత లేదు. మా గ్రామాలకు బస్సులు రావు. వర్కటం సార్.. మాకు సైకిళ్లను పంపిణీ చేయడం ఆనందంగా ఉంది.

– హరిస్, పదో తరగతి, చందాపూర్

క్లుప్తంగా

దివ్యారెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి



మరికల్: ఇటీవల ప్రకటించిన ఎస్ఐ ఫలితాల్లో ఉద్యోగం సాధించిన దివ్యారెడ్డిని మిగతా వారు ఆదర్శంగా తీసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిత్తనూర్ గ్రామానికి చెందిన దివ్యారెడ్డి ఎస్ఐ ఉద్యోగం సాధించడంతో బుధవారం ఆమెను అభినందించి సన్మానించారు. పోటీ ప్రపంచంలో దివ్వరెడ్డిని ఆదర్శంగా తీసుకొని మిగితా నిరుద్యోగులు భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. నరేష్, అశోక్, మురళి, మోహన్, నాగరేష్ పాల్గొన్నారు.

ఫుడ్ సెఫ్టీ అధికారిగా సౌభాగ్యలక్ష్మి

నారాయణపేట: ఫుడ్ సెఫ్టీ జిల్లా అధికారిగా డాక్టర్ సౌభాగ్యలక్ష్మి (పీఓ ఎన్‌సీడీ)ని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు కమిషనర్ ఆఫ్ ఫుడ్ సెఫ్టీ తెలంగాణ ఆర్‌ఈ నంబర్ 694/ఎఫ్ఎస్ఎస్-1/2016-2023 తేదీ ఆగస్టు 5న ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే జోగుళాంబ గద్వాల జిల్లాకు డాక్టర్ జి.రాజు (పీఓ ఎన్‌సీడీ), డాక్టర్ రాంచందర్ రావు (పీఓ ఎన్‌సీడీ)లను నియమించినట్లు పేర్కొన్నారు.

రిటైర్డ్ సైనిక ఉద్యోగులకు సన్మానం



నారాయణపేట రూరల్: ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో మాజీ సైనిక ఉద్యోగులను సన్మానించారు. ఆర్మీలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన ఆశ్వర్‌రెడ్డి, ప్రకాష్‌బాబు, బాలాజి, రఘుకుమార్‌లను స్థానిక జిల్లా పార్టీ కార్యాలయానికి పిలిపించి శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మోదీ ఆధ్వర్యంలో దేశరక్షణ వ్యవస్థ చక్కగా పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాగురావునామాజి, రతంగపాండురెడ్డి, ప్రభాకరవర్ధన్, రఘువీర్, సత్యాయాదవ్, నర్సింహులు, నందునామాజి, లక్ష్మి, వెంకటయ్య, రాము, గోపాల్ పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫాంల పంపిణీ




నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్ ఉన్నతపాఠశాలలో బుధవారం విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లను హెచ్ఎం నర్సింహులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో ఉచిత యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలను ప్రతి విద్యార్థికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే మెజార్టీ విద్యార్థులకు పంపిణీ చేపట్టామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీకాంత్, నరేష్ తదితరులున్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ



మక్తల్: మండలంలోని కాచ్‌వార్‌లో బుధవారం ఇంటింటికీ మొక్కలను ఎంపీటీసీ సభ్యుడు బాల్‌రాంరెడ్డి పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలునాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్ రెడ్డి, కార్యదర్శి భాస్కర్, మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీకాలు విధిగా వేయించాలి



ఊట్కూరు: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు విధిగా వేయించాలని సర్పంచ్ సూరయ్యగౌడ్ కోరారు. బుధవారం మండలంలోని పులిమామిడిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటువ్యాధి నివారణ టీకాల కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల కాపరులు ముందస్తుగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ కృష్ణశ్రీ, రాజేష్, రాఘవరెడ్డి, వార్డుసభ్యులు వెంకటప్ప, హన్మంతు, రాములు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ


విద్యార్థుల నుంచి జవాబులు రాబడుతున్న ఎంఈఓ

నర్వ: అభ్యసన వెలుగు ద్వారా విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈఓ వెంకటయ్య సూచించారు. బుధవారం నాగిరెడ్డిపల్లి, పాథర్చేడ్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆసకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చదవడం, రాయడంపై ఒక్కో విద్యార్థితో పరిశీలన చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సూరం వెంకటేష్, రాజు తదితరులు పాలల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో అభ్యసన మిత్రను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓ వెంకటయ్య కోరారు. బుధవారం మండలంలోని నిడుగుర్తిపాఠశాలను ఆయన సందర్శించారు. వివిధ తరగతుల విద్యార్థులను వారి స్థాయిని బట్టి ప్రశ్నలు అడిగి జవాబులను రాబట్టారు. ప్రభుత్వం చేపట్టిన 45రోజుల అభ్యసన మిత్ర కార్యక్రమం గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ అభ్యసనమిత్రకు సంబంధించిన వర్క్ షీట్లను పూర్తిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మమరెడ్డి, ఉపాధ్యాయులు పద్మ, సునిత, వెంకటప్ప, లియాకత్, సుజాత, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆలయానికి రోడ్డు వేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోస్గి: పట్టణంలోని ఇసుకబావి వద్ద ఉన్న చౌడేశ్వరి మాత ఆలయానికి రోడ్డు వేయడంతోపాటు కబ్జాకు గురవుతున్న ప్రభుత్వస్థలాన్ని కాపాడి కమ్యూనిటీ భవనం నిర్మించాలని బుధవారం తొగుట వీరక్షత్రీయ సమాజం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సంఘం నాయకులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలయానికి రోడ్డువేసి కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యేహామీ ఇచ్చినట్లు ఆ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఫారెస్ట్ భవనం పరిశీలన

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండలో నూతనంగా నిర్మిస్తున్న ఫారెస్ట్ భవనాన్ని ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనులు నాణ్యతతో వేగవంతంగా చేయాలన్నారు. త్వరలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేస్తున్నట్లు చెప్పారు. ఈ భవనం అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతంలో అటవీ పరిరక్షణ సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అంజలి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మీకాంత్, బీఆర్ఎస్ నాయకులు రాజు, మోహన్, రాము పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ


నోట్‌బుక్స్‌పంపిణీ చేస్తున్న నాయకులు

కృష్ణా: మండల పరిధిలోని కున్సి ఉన్నతపాఠశాలలో బుధవారం సర్పంచ్ శంకరమ్మ ఆంజనేయులుగౌడ్, ఎంపీటీసీ సభ్యుడు రాంచందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం మనఊరు- మన బడిలో భాగంగా విద్యార్థులకు అవసరమయ్యే అన్నిసౌకర్యాలను కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాల్‌రాజ్, హెచ్ఎం మహేష్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, నారాయణ, శివశంకర్, శ్రీశైలం, సౌమ్య, రియాజ్ పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన



ఓటింగ్ మిషన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు


మక్తల్లో ఈవీఎంలో ఓటు వేసేందుకు ఓటరుకు అవగహన కల్పిస్తున్న దృశం

మాగనూర్: మండలంలోని 18 సంవత్సరాలు నిండిన ప్రజలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కలిగి ఉండాలని ఆర్ఐ శ్రీశైలం అన్నారు. బుధవారం మండలంలోని పర్మన్‌దొడ్డి, అమ్మపల్లి గ్రామాల్లో మొబైల్ వ్యాన్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌తోపాటు వీవీప్లాట్ ఏర్పాటుచేసి వాటిపై అధికారులు అవగాహన కల్పించారు. మూడు నెలలో ఎన్నికలు రాబోతున్నందున ప్రజలు అందరూ ఓటు వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పేరుల లిస్టులో ఉన్నాయా లేదా అని ఒకసారి చెక్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పర్మన్‌దొడ్డి సర్పంచ్ వెంకటమ్మ, అమ్మపల్లి సర్పంచ్ పద్మమ్మ, కానిస్టేబుల్ గోపాల్, వీఆర్ఏ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని ప్రజలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ అన్నారు. బుధవారం మండలంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌తోపాటు వీవీప్లాట్ ఏర్పాటుచేసి వాటిపై అవగాహన కల్పించారు. మూడు నెలలో ఎన్నికలు రాబోతున్నందున ప్రజలు అందరూ ఓటు వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డీటీ వాసుదేవ్‌రావు, ఎన్నికల డీటీ కాలప్ప తదితరులు ఉన్నారు.

క్విట్‌ఇండియా ఉద్యమం స్ఫూర్తితో ముందుకు..



మక్తల్: క్విట్‌ఇండియా ఉద్యమం పురష్కరించుకుని పట్టణంలో బుధవారం కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి జాతీయ జెండాను ఆవిష్కరించారు. క్విట్‌ఇండియా ఉద్యమంలో జరిగిన సంఘటనలను గుర్తు చేశారు. 1942 ఆగస్టు 9న మహాత్మాగాంధీ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ముంబైలో జరిగిన సమావేశంలో ఉద్యమానికి పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానీయుల ప్రాణత్యాగాలు జరిగాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహులు, కట్ట వెంకటేష్, రవికుమార్, గోవర్ధన్, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్‌లో తనిఖీ

అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాప్‌పై దాడి చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. నాగల్‌కడ్మూర్‌లో అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారనే సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడి నిర్వహించి 40 క్వార్టర్ సీసాలు, 12 బీర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్ట్ షాప్ నిర్వాహకుడు గోవర్ధన్‌రెడ్డిపై కేసు నమోదు చేశామని తెలిపారు.